క్లుప్తంగా

రెండు గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలు

ముప్పాళ్ళ: మండలంలోని లంకెలకూరపాడు, మాదల, రుద్రవరం గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలు ఆదివారం జరిగాయి. ఆయా గ్రామాల్లో 2021–22 సంవత్సరానికి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. ఎంత మంది జాబ్‌కార్డుదారులు పనులకు హాజరయ్యారు? చేపట్టిన పనుల వివరాలను గ్రామసభలో చర్చించారు. డీఆర్పీలు ఖాజా, సుదర్శన్, కృష్ణమూర్తి, ఏపీఓ రామారావు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం



క్రోసూరు: నరసరావుపేటలో ఆదివారం జరిగిన ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అచ్చంపేట, క్రోసూరు మండలాలకు చెందిన ముగ్గురు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. స్వరూపరాణి, విజయనిర్మల, అంజలీదేవిని సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెదబాబు, ప్రధాన కార్యదర్శి చంద్రజిత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా వేణు

ముప్పాళ్ళ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల కన్వీనర్‌గా గోళ్ళపాడు గ్రామానికి చెందిన పరిమివేణు నియమితులయ్యారు. ఈ మేరకు పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ అద్దంకిబాబు మాదిగ ఆదివారం నియామక పత్రం అందించారు.

రామకృష్ణాపురం గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని ఏపీ సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో రానున్న విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.వి.స్వర్ణకుమారి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రామకృష్ణాపురంలోని గురుకుల పాఠశాలలో చేరగోరు విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న 5వ తరగతిలో ప్రవేశంగోరు విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని వివరించారు.

ఆంజనేయ ఆలయ స్థలాన్ని పరిరక్షించాలి

అచ్చంపేట: చల్లగరిగ గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం పక్కనే ఉన్న దేవస్థాన స్థలాన్ని పరిరక్షించాలని గ్రామానికి చెందిన పసుపులేటి పాపిరెడ్డి ఆదివారం కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన సర్వే నంబర్ 43లోని డొంక పోరంబోకు స్థలంలో ఆంజనేయస్వామిగుడి, అంకమ్మతల్లి ఆలయాలు పూర్వకాలం నుంచి ఉన్నాయని, ఆ పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని భక్తులు పొంగళ్లు పొంగించుకునేందుకు, ఉత్సవాలు నిర్వహించేందుకు వినియోగిస్తున్నారని చెప్పారు. ఆ స్థలాన్ని ఓ గ్రామస్తుడు ఆక్రమించుకుని ఇల్లు కట్టే యత్నం చేయడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు వివరించారు. కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమంలోనూ ఫిర్యాదు చేశామని వెల్లడించారు. అయినా గ్రామస్తుడు ఆ స్థలంలో ఇంటి నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నాడని, అదేమని అడిగితే తనపై తప్పుడు కేసు పెట్టాడని వివరించారు. పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని, గుడి స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.


చలివేంద్రాలు ఏర్పాటు



నకరికల్లు: దాతల సహకారంతో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్ చెప్పారు. గుండ్లపల్లి గ్రామ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గుండ్లపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. తొలిరోజు ఏఎస్‌ఐగా పనిచేసిన షేక్ మహబూబ్‌బాషా జ్ఞాపకార్థం ఆయన కుమారులు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చందా మీరా, సభ్యులు దాచేపల్లి రహీం, కరాలపాటి సైదావలి, గండు మస్తాన్‌వలి, జమాల్ అల్లా బక్షు, నకరికంటి బడేసా, ముజావర్ మహబూబ్‌సుభాని, షేక్.షకూర్, చికిలి మహబూబ్‌సుభాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

పైసలిస్తే నిబంధనలు తుంగలోకే..

- చనిపోయిన వ్యక్తి పేరిట అర్జీ పెట్టినా అడంగల్ సవరణ!
- ఇదీ సత్తెనపల్లి రెవెన్యూ అధికారుల తీరు



సత్తెనపల్లి: పైసలిస్తేకానీ రెవెన్యూ అధికారులు పనులు చేయడం లేదు. కాసులిస్తే నిబంధనలను తుంగలోతొక్కి మరీ అర్జీలు పరిష్కరిస్తున్నారు. తాజాగా జరిగిన ఈ ఘటనే దీనికి నిదర్శనం.. అసలేం జరిగిందంటే.. సత్తెనపల్లి పట్టణానికి చెందిన షేక్ ఘన్ సైదాకు అబ్బూరు రోడ్డులో సర్వే నంబర్ 246/2ఏలో 22 సెంట్లు, 246/2సీలో 42 సెంట్లు కలిపి మొత్తం 64 సెంట్ల భూమి ఉంది. అయితే ఆన్‌లైన్‌లో మాత్రం 246/2ఏలో 42 సెంట్లు, 246/2సీలో 22 సెంట్లు ఉన్నట్లు నమోదైంది. దీనిని మార్చాలని ఘన్ సైదా అనేకమార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశాడు. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం సైదా మరణించాడు. ఆయనకు భార్య ప్యారీ, కుమారుడు ఉన్నారు. ఆ తర్వాత సవరణ కోసం సైదా భార్య, కుమారుడు కూడా కార్యాలయాల చుట్టూ తిరిగారు. కానీ పనికాలేదు. ఈ నేపథ్యంలో అబ్బూరు రోడ్డులోని ఘన్ సైదా భూమి పక్కన వెంచర్ వేశారు. దీంతో సైదా భూమికి మరింత విలువ పెరిగింది. ఈ నేపథ్యంలో గత నెల 13న చనిపోయిన సైదా పేరున అడంగల్ సవరణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టారు. దీనికి అతని భార్య ఆధార్‌కార్డు జతచేశారు. నిబంధనల ప్రకారం.. ఓ వ్యక్తి మృతి చెందితే భార్యకు కానీ, కుమారుడికి కానీ మ్యూటేషన్ చేసి అనంతరం అడంగల్ సవరణ చేయాలి. కానీ నిబంధనలను తుంగలో తొక్కి చనిపోయిన వ్యక్తి పేరిట అర్జీ పెట్టినా అధికారులు ఏమాత్రం అభ్యంతరం పెట్టకుండా మూడు రోజుల క్రితం అడంగల్ సవరణ చేసేశారు. ముడుపులు అందినందు వల్లే నిబంధనలు పట్టించుకోకుండా అధికారులు అడంగల్ సవరణ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వీఆర్వో తప్పుగా పెట్టడంతో గుర్తించాను

మ్యూటేషన్ చేయకుండా అడంగల్ సవరణ పెట్టకూడదు. భార్య పేరుతో మ్యూటేషన్ పెట్టి తర్వాత సవరణ చేయాలి. కానీ వీఆర్వో తప్పుగా చనిపోయిన వ్యక్తి పేరుతో దరఖాస్తు పెట్టడంతో నేను దానిని గుర్తించా. డిజిటల్ సిగ్నేచర్ చేయకుండా నిలిపివేశా.

– కె.నగేష్, తహసీల్దార్, సత్తెనపల్లి

రేపు గంగమ్మ తల్లి నెల తిరునాళ్ల



తిరునాళ్లకు ముస్తాబైన గంగమ్మతల్లి

అచ్చంపేట: ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగాదేవి పేరంటాళమ్మ నెల తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం నిర్వహించేందుకు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి కోటి రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజు అమ్మవారికి తిరునాళ్ల నిర్వహించి, మరుసటి నెలలో వచ్చే పౌర్ణమినాడు నెలతిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన తెలిపారు. గత నెల 5వ తేదీన తిరునాళ్లు నిర్వహించామని, సరిగ్గా నెలరోజుల తరువాత నెల తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అమ్మవారి అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అమ్మవారి దర్శనానికి, తలనీలాలకు, వస్త్రాలు విక్రయాలకు, ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. అచ్చంపేట ఎస్‌ఐ కె.పాల్ రవీంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

న్యాయమూర్తి బి.దేవేంద్రరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.దేవేంద్రరెడ్డి

నరసరావుపేట రూరల్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దేవేంద్రరెడ్డి తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు ఆదివారం లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. మహిళా హక్కులు, బాల్యవివాహాలు, ఉచిత న్యాయ సహాయం, భరణం, గృహహింసా చట్టం తదితర చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. మహిళలు, యవతులు, బాలికలు ఎలాంటి సమస్యలు ఉన్నా ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్స్ ఎస్‌బీఏ ఝాన్సీ, కె.కాళిదాసు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చిలకలూరిపేట టౌన్: దేశంలో మహిళలపై దాడులపై అప్రమత్తంగా ఉండాలని మండల సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సరేంద్రరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వారికి సంబంధించిన అన్ని చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ చట్టాలు పోక్సో, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్.శ్రీనివాసులు, భానుప్రసాద్, తోట రామాంజనేయులు, పోతుల వెంకట్, రాజేష్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ వ్యవస్థాపకులు రామ్మోహన్‌రావుకు నివాళి



రామ్మోహనరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు పి.రామ్మోహనరావు 15వ వర్ధంతి స్థానిక బస్టాండ్ ఎదుట ఎన్‌ఎంయూ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు విగ్రహానికి డి.హనుమాన్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత రామ్మోహనరావుకు దక్కుతోందన్నారు. కార్యక్రమంలో డిపో కమిటీ చైర్మన్ వి.శివనాయక్, పీవీ రాఘవ, హరిహర బాబు, కఠారి, సురేష్‌నాయక్, ముసలమ్మ, ఎం.కె.నాయక్, సౌభాగ్యరాజు, సైదా, జానీబాషా, యోహాను పాల్గొన్నారు.

కాశీనగర్ 1947 చిత్ర షూటింగ్



కంటెపూడి శివాలయంలో చిత్ర బృందంతో ఎస్‌ఐ రఘుపతి

సత్తెనపల్లి: శ్రీగణేష్‌దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రాయదుర్గం రమాదేవిరెడ్డి నిర్మిస్తున్న కాశీనగర్ 1947 చిత్రం షూటింగ్ సీనియర్ న్యాయవాది ఎంవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ఆదివారం పట్టణ ఎస్‌ఐ రఘుపతి కొబ్బరికాయ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. సత్తెనపల్లి మండలం కంటిపూడిలోని శివాలయం, బాసు లింగారెడ్డి, వేంపాటి శ్రీనివాసరెడ్డి గృహాలలో సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ నటులు జెన్నీ, కేవీఎల్ నరసింహారావు, దిలీప్ రాథోడ్, ఆరోహి, రాయదుర్గం రమాదేవి రెడ్డి, వల్లెం చెన్నకేశవ నాయుడు, షేక్ సుభాని, ఓంకార్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం చిత్తజల్లు ప్రసాద్. కెమెరామెన్ జి.కృష్ణ నాయుడు, దేవకి మురళీకృష్ణ. సంగీతం లక్ష్మణ సాయి. పాటలు జి.సీతారామ చౌదరి, ఎల్‌బీసీ రఘుబాబు, ఫైట్స్ హుస్సేన్ భాయ్, కొరియోగ్రాఫర్ బండ్ల రామారావు. చిత్రాన్ని ఉగాదికి విడుదల చేయబోతున్నట్లు నిర్మాత రాయదుర్గం రమాదేవి, చిత్ర దర్శకుడు చిత్తజల్లు ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బెల్లంకొండ: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను లారీ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటన బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ కె.అమీర్ కథనం ప్రకారం నందిరాజుపాలెం గ్రామానికి చెందిన నూతనపాటి వెంకటేశ్వరరావు(25), అతని స్నేహితుడు చౌటపాపాయపాలెం గ్రామానికి చెందిన మోటుపల్లి నరసింహారావు రాజుపాలెం నుంచి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో రాజుపాలెం దాటిన తరువాత బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద పిడుగురాళ్ల నుంచి వస్తున్న సిమెంట్ లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న వెంకటేశ్వరరావు లారీ ముందు భాగంలో ఉన్న టైర్ కింద పడడంతో తల పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. అతను అక్కడికక్కడే చనిపోయాడు. నరసింహారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను 108లో సత్తెనపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో బండ్లమ్మవారు



వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో పాల్గుణ మాసం రెండవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి, మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలిరావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

14న హోమం..

బండ్లమ్మవారి దేవాలయంలో ఈ నెల 14న ప్రత్యేక హోమం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు, ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు హరిద్ర శృంగార్చన పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఏడు వారాలు పూజలు చేసిన వివాహం కాని యువతీ యవకులు ఈ ప్రత్యేక హోమంలో పాల్గొనాలని తెలిపారు. సత్వర వివాహ ప్రాప్తి కలుగుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ వంశపారంపర్య అర్చకులు కుంచల నరసారెడ్డి తదితరులు ఉన్నారు.

వెండి వస్తువులు బహూకరణ

పిట్టలవానిపాలెం: బండ్లమ్మ దేవాలయానికి హైదరాబాద్‌కు చెందిన ఉప్పుటూరి వేణుగోపాలరావు కుటుంబ సభ్యులు రూ.50 వేల విలువల గల రెండు వెండి వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారికి వెండి పూజా పళ్లెం, తీర్థపు గిన్నె, ఉద్దరిణెలు అందజేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, ఇంటూరి నారాయణ స్వామి కుటుంబ సభ్యులు, అర్చక స్వాములు కుంచల నరసారెడ్డి, ఆలయ సిబ్బంది కొండవీటి శ్రీనివాసరావు ఉన్నారు.

అమూల్ పాల ఉత్పత్తిదారుల నుంచి మంచి స్పందన



అమూల్ సెంటరు పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: అమూల్ పాల ఉత్పత్తిదారుల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు మండల అమూల్ పాల సేకరణ పర్యవేక్షణ అధికారి షేక్ అబ్దుల్ బాషా ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రతిరోజు 1500 లీటర్ల పాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. 10 శాతం లీటరు పాల ధర రూ.78లు, 11శాతం ఉంటే రూ.85లు అమూల్ సంస్థ పారదర్శకంగా బిల్లులు నెలలో రెండు సార్లు పాల ఉత్పత్తిదారులు బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తుందన్నారు. ఇప్పటి వరకు పాల ఉత్పత్తిదారులకు బిల్లులు పెండింగ్ లేదన్నారు. ఆయనతో పాటు వేల్పూరు సెక్టారు పశువైద్యాధికారి పలిపర్తి గణేష్‌కుమార్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిడుగురాళ్లకు చెందిన విజయ నర్సింగ్ హోమ్ వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని నరసరావుపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది మోదుగుల ఆరోగ్యం చౌదరి ప్రారంభించారు. వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ కె.వి.సుబ్బారావు, ఎం.ఫణికుమార్, ఎం.వి.ఎస్. సునీల్ కుమార్ పాల్గొని వైద్యసేవలు అందించారు. ఈ వైద్య శిబిరములో గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 127 మందికి గుండె, ఊపిరితిత్తులు, నరాల బలహీనత, నెమ్ము, డెంగీ, మలేరియా సంబంధిత వ్యాధులకు సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలు చేశారు. ఆయా వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వైద్యులు గ్రామస్తులకు వివరించారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపిస్తే చట్టపరమైన చర్యలు



పొలేష్‌ను సన్మానిస్తున్న ఎస్సీ కాలనీవాసులు

వినుకొండ(నూజెండ్ల): ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.పొలేష్ అన్నారు. వినుకొండ రూరల్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులాలపై వివక్షత చూపిస్తే చర్యలు తీసుకునేందుకు చట్టాలు ఉన్నాయని గుర్తుచేశారు. గ్రామాల్లో వివక్షత చూపిస్తే కమిటీని ఆశ్రయించవచ్చని సూచించారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ బిల్లుల సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు తెలపడంతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారంతో పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం పొలేష్‌ను ఎస్సీ కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోజిబాబు, కందుకూరి శ్యాం, అమృతపూడి ఐజ్రాజ్, ఇమ్మానుయేలు, యాకోబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నిరంతరం కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్.వి.రామిరెడ్డి తెలిపారు. మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం ఎస్టీయూ మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామిరెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. మున్సిపల్ హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు డీడీఓ అధికారాలు ఇవ్వాలని కోరారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలల పర్యవేక్షణ సమయంలో అనుచితంగా వ్యవహరించటం తగదన్నారు. మధ్యాహ్న భోజనం పథకం అమలులో ఉపాధ్యాయులను తప్పించాలని కోరారు. ఈసందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 30మంది ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎం.సుభాని, జె.గంగాధరబాబు, రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డి.పెదబాబు, యు.చంద్రజిత్‌యాదవ్, గౌరవాధ్యక్షుడు షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

ఆధునిక వైద్యంతో నవ్వుకు నగిషీలు

- నవ్వేద్దాం హాయిగా... అందంగా...
- దంత వైద్యంలో ఆధునిక పద్ధతులు
- నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం



దంత వైద్యుల దినోత్సవం పోస్టర్స్

గుంటూరు మెడికల్: మనిషి జీవించాలంటే గాలి, నీరు తరువాత ఆహారం తప్పనిసరి. దాన్ని నోటి ద్వారా దంతాలతో నమిలి తీసుకుంటాం. ఆహారం తీసుకునేందుకు దంతాలు సహకరించకపోతే ఆ బాధ వర్ణనాతీతం. వర్ణించడం కష్టం. ఆధునిక జీవన శైలికి అలవాటు పడిన నేటి ప్రజలు.. ముఖ్యంగా నగర ప్రజలు దంత సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఆహారపు అలవాట్లు సక్రమంగా లేకపోవడం, కొద్దిపాటి సమస్య ఉన్నప్పుడు పట్టించుకోకపోవడంతో దంత సమస్యలు పెద్దవిగా మారుతున్నాయి. జనాభాలో నూటికి 90 శాతం తమ జీవిత కాలంలో ఏదో ఒక సమయంలో దంత సమస్య బారిన పడుతుంటారు. దంత సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది మార్చి 6న జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

అందుబాటులో కాస్మోటిక్ వైద్య పద్ధతులు

ఒకప్పుడు పన్ను పుచ్చిపోతే పీకి వేయడం తప్ప, వేరే ఆలోచన ఉండేది కాదు. నేడు దంత వైద్య శాస్త్రం (డెంటిస్ట్రి) బాగా అభివృద్ధి చెందడంతో పూర్తిగా పాడైన పళ్లను పీకే పని లేకుండా మరమ్మతులు చేసి సాధారణ దంతంలాగా తయారు చేస్తున్నారు. నేడు పన్ను పీక కుండా రూట్ కెనాల్ చికిత్స అందుబాటులో ఉంది. పుచ్చిపోయిన పంటిని శుభ్రం చేసి అందులో సిమెంట్, సిల్వర్ మెటల్‌ను పెట్టి నొప్పిని తగ్గించే విధానం అందుబాటులో ఉంది. పాచి, గారపట్టిన పళ్లను స్కేలింగ్ ద్వారా శుభ్రం చేస్తున్నారు. కదిలిన, అరిగిన పళ్లకు, చిగుళ్ల సమస్యకు ఫ్లాప్ సర్జరీ, పళ్లు ఊడిపోయిన వారికి ఇంప్లాంట్స్ సహాయంతో ఫిక్స్‌డ్ పళ్లు ఏర్పాటు చేస్తున్నారు. షుగర్‌వల్ల దంతాలు ఊడిపోతున్న వారికి బేసల్ ఇంప్లాంట్స్ ద్వారా ఫిక్స్‌డ్ పళ్లు, ఎత్తు, వంకర పళ్లు ఉన్నవారికి కాస్మోటిక్ బ్రైసెస్‌తో ఆర్థో ట్రీట్‌మెంట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. చిన్న పిల్లలకు పళ్లు పుచ్చిపోకుండా, ఎగుడుదిగుడులా లేకుండా పళ్ల వరుస అందంగా ఉండేలా పిడోడాంటిక్ ట్రీట్‌మెంట్ నేడు మార్కెట్‌లో అందుబాటులో ఉంది. సాధారణ చికిత్సల మాదిరిగా దంత వైద్యంలో సైతం కాస్మోటిక్ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ముఖారవిందం పాడవకుండా చిరునవ్వులు చెరిగిపోకుండా దంతాల్ని అందంగా అమర్చుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం

గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ 40 నుంచి 50 మంది వివిధ రకాల దంత సమస్యలతో వస్తున్నారు. పుచ్చిపోయిన దంతాల్ని సిమెంట్‌తో ఫిల్ చేయడం, బాగా పుచ్చిపోయిన వాటిని కొద్దిపాటి మత్తు ఇచ్చి పీకివేయడం, గారపట్టిన వాటిని క్లీనింగ్ చేస్తున్నారు. స్పెషాలిటీ వైద్యనిపుణులు అందుబాటులో ఉండటంతో అత్యాధునిక దంత శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు.

జిల్లాలో 600 మంది దంత వైద్యులు



ఒకప్పుడు దంత వైద్యుడి వద్దకు వెళ్లకుండా ఇళ్లలోనే వైద్యం చేసుకునేవారు. నేడు ప్రజలకు కొంత మేరకు అవగాహన పెరిగింది. గుంటూరు జిల్లాలో 600 మంది వైద్యులు ఉండగా, గుంటూరు నగరంలోనే 110 మంది దాకా ఉన్నారు. దంత వైద్యంలో కాస్మోటిక్ సేవలు రావడం, ప్రజలకు కూడా అవగాహన పెరగడంతో దంత వైద్యులకు బాగా డిమాండ్ పెరిగింది. ఒక్కో వైద్యుడు ప్రతిరోజూ 15 నుంచి 20 మందికి వైద్య సేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ తాళ్ల హర్షవర్ధన్‌రెడ్డి, దంత వైద్యుల సంఘం జిల్లా సెక్రటరీ

దంత సమస్యలపై అవగాహన అవసరం



ప్రతి ఒక్కరు దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రాథమిక దశలోనే వైద్యుల్ని సంప్రదించడం ద్వారా పన్ను పూర్తిగా పాడవ్వకుండా వైద్యం అందించవచ్చు. పిల్లలకు తరచుగా దంత సమస్యలు వస్తుంటాయి. వాటిని తల్లిదండ్రులు గమనించి వైద్యుల్ని సంప్రదించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా టూత్ బ్రష్‌ను మార్చాలి. ప్రతి రోజూ రెండు పూటలా దంతాలు శుభ్రం చేసుకోవాలి. ఏదైనా ఆహారం తిన్న వెంటనే నోటిలో నీరు పుక్కిలించాలి.

డాక్టర్ రేపూరి లక్ష్మి, దంత వైద్య నిపుణురాలు, గుంటూరు

రీసర్వే పనులు వేగవంతం అయ్యేలా చర్యలు

శావల్యాపురం: రీసర్వే పనులు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు ఆదివారం తెలిపారు. మొదట దశలో ఎంపిక చేసిన వేల్పూరు, శానంపూడి, పోట్లూరు, కనమర్లపూడి, పిచికలపాలెం రెవెన్యూ గ్రామాల్లో భూములు కొలతలు సరిహద్దులను రైతుల సమక్షంలో అధునీకరణ యంత్ర పరికరాలు ద్వారా ఆన్‌లైన్ విధానంలో నమోదు చేశామన్నారు. పిచికలపాలెం, శానంపూడి రెవెన్యూ గ్రామాల్లో భూముల కొలతలు 90 శాతం పూర్తి అయినట్లు వెల్లడించారు. వేల్పూరు రెవెన్యూ గ్రామంలో రికార్డు పనులు జరుగుతున్నారు.